# రాష్ట్ర అభివృద్ధిలో మెట్రో పాత్ర కీలకం

## మెట్రో రైల్‌భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రప్రభ) : హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్), హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం మెట్రోరైల్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి కృషికి ఆయన నివాళి అర్పించారు. ఈసందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తోందని, దేశంలో అనేక రంగాలలో నంబర్ వన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి, రాష్ట్ర పురోగతిలో మెట్రోరైల్ పాత్ర కీలకమైందని అన్నారు. రాష్ట్రాన్ని గొప్ప ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో మెట్రోరైల్‌ను కీలక భాగస్వామ్యమని పేర్కొన్నారు. మెట్రోరైల్ ఫేజ్-2(ఎ)కి సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఫేజ్- 2(బి)కి సంబంధించి డీపీఆర్‌ను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపనున్నదని ఆయన వెల్లడించారు. రాబోయే మెట్రో రెండో దశ నిర్మాణం ఎన్నో సవాళ్ళతో కూడుకున్నదని, విజయవంతంగా ఈ ప్రాజెక్టును పట్టాలు ఎక్కించడానికి మెట్రో అధికారులు గట్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్ మెట్రో రైల్ సీనియర్ అధికారులతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.